విద్యార్థుల బంగారు భవితకు బాటలు


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని ప్రశంసాపత్రం,జ్ఞాపికతో సత్కరిస్తున్న అధికారులు


హాజరైన విద్యార్థులు

- విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకే 'జగనన్న ఆణిముత్యాలు'
- సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విద్యపరంగా మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో కడప ఎంఈఓ పాలెం నారాయణ అధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాలు కడప నియోజకవర్గ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

కడప నియోజకవర్గస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అలాగే ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఒకొక్కరికి రూ. 15 వేలు చొప్పున నగదుతో పాటు సర్టిఫికెట్, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్య పరంగా ప్రభుత్వం అనేక సంస్కరణలను తెచ్చి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిందన్నారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, డీఈఓ కార్యాలయ ఏడీ దేవరాజు, కడప ఎంఈఓ పాలెం నారాయణ, మాజీ సైన్సు అధికారి రెహమాన్, హెచ్ఎంలు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నా కూతురి మాటలు మనసులో మెదులుతున్నాయ్..



నేను బాగా చదివి మంచి మార్కులు సాధించి నిన్ను ఏదో ఒక రోజు ముఖ్యమంత్రి వద్ద తీసుకుపోతానని కుమార్తె చెప్పిన మాటలో నేడు మనసులో మెదులుతున్నాయి. ఆ ప్రకారమే నన్ను ఈ రోజు ఈ స్టేజీ పైకి ఎక్కించి సన్మానింప చేసింది.

- సులోచన, పదో తరగతిలో ద్వితీయస్థానంలో నిలిచిన ఉజ్వల తల్లి

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు..



మా చదువుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను తెచ్చారు. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చారు. మా తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులైనా ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమాలకు ఆకర్షితులై నన్ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. పదిలో అత్యుత్తమ మార్కులు సాధించి నియోజక వర్గంలో ప్రథమస్థానంలో నిలిచాను. ఇందుకు మా ఉపాధ్యాయుల కృషి కూడా ఉంది. వారికి, నాతల్లిదండ్రులకు జీవితాంతం రుణపడి ఉంటా.

- జోషిత, పదిలో నియోజక వర్గ టాపర్

క్లుప్తంగా

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శివ శంకర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి సీబీఎస్ఈ, ఒలింపియాడ్, ఈ–టెక్నో వంటి నిషేధిత పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. పుస్తకాలు, యూనిఫామ్ అంటూ ఫీజుల రూపంలో భారీగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యాలయాలను కేవలం వ్యాపార సముదాయాలుగా చూస్తున్నారే తప్ప విద్యా కేంద్రాలుగా చూడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత


విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న గుడ్ మ్యానర్స్ స్కూల్ డైరెక్టర్ గోపి, సుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరం రవీంద్రనగర్‌లోని పేద విద్యార్థులకు గుడ్ మ్యానర్స్ స్కూల్ డైరెక్టర్ గోపి, డాక్టర్ సి. సుబ్బారెడ్డి, కెరీర్ గైడెన్స్ నిర్వాహకులు కె. బాలయల్లారెడ్డి చేయూతనందించారు. పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్న 8వ తరగతి చదివే షేక్ సనా ఆఫియా, 7వ తరగతి చదివే షేక్ మహమ్మద్ రోషన్‌కు ఆర్థిక సాయం చేశారు. స్కూల్ ఫీజులో కొంత భాగాన్ని కూడా వారే భరించారు. 43వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీరు


రోడ్డుపై నిలిచిన మురుగునీరు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 27వ డివిజన్ గౌసనగర్‌లో మసీద్ ఏ హుసేనియా వీధిలో మురికి కాలువలు నిండి మురుగునీరంతా రోడ్డుపైకి చేరింది. నీరు రోడ్డుపైనే నిల్వ ఉండటంతో ఈ నీటిలో రాకపోకలు సాగించలేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు ఈ నీటిలో ఆడుకుంటూ వ్యాధులు బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేషన్ అధికారులు చొరవ తీసుకొని ఈ మురుగునీటిని తొలగించాలని వారు కోరుతున్నారు.

17న కవి సమ్మేళనం

కడప కల్చరల్ : కడప నగరంలో ఈనెల 17న ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. బజ్మే జావీద్ ఉర్దూ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 7 గంటలకు నగరంలోని కోటగడ్డవీధిలోగల షాహిర్ మంజిల్‌లో ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షులు ప్రొఫెసర్ సత్తార్ సాహిర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాయచోటి ఉర్దూ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ హైదర్ అలీ అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ ఉర్దూ కథా రచయిత మహమూద్ షాహిద్ ముఖ్య అతిథిగా, ఇంతియాజ్ అహ్మద్ సాఖిబ్ తదితరులు కూడా పాల్గొంటారన్నారు.

పారదర్శకంగా బదిలీలు చేపట్టాలి

కడప రూరల్ : వైద్య ఆరోగ్యశాఖ జోన్–4 పరిధిలో చేపట్టే సాధారణ బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్‌ను విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ జోన్–4 పరిధిలో చేపట్టే ఉద్యోగుల సాధారణ బదిలీలను నిబంధనల మేరకు చేపట్టి ఉద్యోగులకు మేలు చేకూరేలా చూడాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు తిమ్మారెడ్డి, కోశాధికారి నిత్య పూజయ్య, ఉపాధ్యక్షులు బాల పుల్లయ్య, నాగలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌వైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చిన్న


కార్యదర్శిగా ఎన్నికైన నాగేంద్రబాబు

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా చిన్న, కార్యదర్శిగా నాగేంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షుడిగా శివప్రసాద్, రాజశేఖర్, నరసింహనాయక్‌ను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా సహాయ కార్యదర్శులుగా రాహుల్, మురళీ, మస్తాన్, సోయల్, జిల్లా కమిటి సభ్యులుగా అజయ్, కార్తీక్, వెంకటేష్, వినయ్, కిరణ్, దామోదర్, రవి, గోపీనాథ్, కృష్ణారెడ్డి, మోహన్‌లను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

కడప కల్చరల్ : కడప నగరం వన్‌టౌన్ సర్కిల్ వద్దగల హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా మహమ్మద్ షహబుద్దీన్ (మొహర్ అలీషా) దర్గా ఉరుసు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా మహమ్మద్ జమాలుల్లా బాషా హుసేనీ సాహెబ్ తమ ఇంటి నుంచి గంధం కలశాన్ని ఫకీర్ల సాహస విన్యాసాలతో ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. అనంతరం గురువుల మజార్‌పై పూలచాదర్, గంధం సమర్పించి ప్రార్థనలు చేశారు. ఫాతెహా నిర్వహించి హాజరైన భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఆశా కార్యకర్తల సమస్యలపై పోరాటాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. ఆశా కార్యకర్తలు చాలీ చాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పని ఒత్తిడితో అనారోగ్యాల బారిన పడుతున్నారని వాపోయారు. వీరికి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించి జాబ్ కార్డు అందించాలన్నారు. ఆశాలకు వేతనం కూడిన సాధారణ, ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి, యూనియన్ నాయకురాళ్లు రాజేశ్వరి, సుభాషిణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుక పంపిణీ చరిత్రాత్మకం


విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేస్తున్న బంగారు నాగయ్య యాదవ్

కడప కార్పొరేషన్ : పాఠశాలలు తెరిచిన తొలిరోజే జగనన్న విద్యాకానుక అందించడం చరిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్ అన్నారు. గురువారం స్థానిక ఏఎస్ఆర్ నగర్‌లోని ఎంపీపీ స్కూల్‌లో విద్యాకానుక కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా బంగారు నాగయ్య యాదవ్ మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం, షూ, టై, బెల్ట్ అందించడం గొప్ప విషయమన్నారు. పిల్లల భవిష్యత్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహానికి ఇది నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ ఓబుల్ రెడ్డి, సుమన్ పాల్గొన్నారు.

19న క్రీడా పాఠశాల మండలస్థాయి ఎంపికలు

చింతకొమ్మదిన్నె : కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 4, 5 తరగతి ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4వ తరగతిలో ప్రవేశానికి బాలురకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లకు ఎంపికలు నిర్వహిస్తారన్నారు. గతేడాది మిగిలిన 11 సీట్లకు గాను బాలికలకు, సీట్లు బాలురకు ఈ ఏడాది 5వ తరగతిలో ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈ ఎంపికలు బయనపల్లె శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉంటాయన్నారు. ఎంపికలో పాల్గొనే విద్యార్థులు 2014 ఆగస్టు 1 నుంచి 2015 జులై మధ్య పుట్టిన విద్యార్థులు ఉండాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశాలు పొందే విద్యార్థులు 2013 ఆగస్టు 1 నుంచి జులై 31 మధ్యలో పుట్టిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 3866431633, 99087 83229 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

ముఖ్యమంత్రిపై విమర్శలు సరికాదు

కడప కల్చరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే సమయంలో తగిన జాగ్రత్త వహించాలని గ్రేటర్ రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షులు చెన్నంశెట్టి మురళీకృష్ణ తెలిపారు. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షులు నడ్డా రాష్ట్రానికి వచ్చినపుడు పనిగట్టుకుని ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదివినట్లుగా పసలేని విమర్శలు గుప్పించారని, ఇక్కడి ప్రతిపక్షాలు కూడా ఆ విమర్శలను చూసి నవ్వుకుంటున్నాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక యువ ముఖ్యమంత్రిగా సంపూర్ణంగా ప్రజల కోసమే ప్రభుత్వం అన్న రీతిలో పాలిస్తున్నారన్నారు.

పలువురు కేంద్ర మంత్రులు సైతం ప్రశంసించిన విషయం వారికి కూడా తెలుసన్నారు. కానీ రాష్ట్రంలోని కొన్ని రాజకీయ శక్తులను సంతోష పరిచేందుకు వారు అలా రాసిచ్చిన స్క్రిప్టును చదివారన్నారు. నిజానికి వారికి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన గురించి బాగా తెలుసని, వారు మన స్ఫూర్తిగా ఈ విమర్శలు చేసినట్లుగా కనిపించడం లేదని ఆయన అన్నారు.

విద్యార్థులను అభినందించిన నారాయణ


ర్యాంకు సాధించిన విద్యార్థినిని సన్మానిస్తున్న నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణ

కడప ఎడ్యుకేషన్ : జాతీయస్థాయి నీట్, ఈఏపీసెట్‌లలో ర్యాంకులను సాధించిన విద్యార్థులను గురువారం నారాయణ విద్యాసంస్థల ఫౌండర్ పి.నారాయణ అభినందించారు. ఇందులో భాగంగా కడప ఎన్‌జీఓ కాలనీలోని నారాయణ ఒలంపియాడ్ జూనియర్ కళాశాలలో నీట్‌లో 193 వర్యాంకు సాధించిన బృహతిని, ఈఏపీసెట్‌లో 66వ ర్యాంకు సాధించిన భార్గవిలను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రామోహన్‌రెడ్డి, డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ మురళిమోహన్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలి


బ్రిగేడియన్ సోమశేఖర్‌ను అభినందిస్తున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్ర, తెలంగాణ డిప్యూటీ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ బ్రిగేడియన్ సోమశేఖర్‌ను జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా ప్రెసిడెంట్ లక్ష్మినారాయణ, అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ దిలీప్‌రెడ్డి కోరారు. గురువారం కడపకు వచ్చిన ఆయన్ను వారు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మి నారాయణ, దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ మిలటరీ హాస్పటల్, మిలటరీ క్యాంటీన్ జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో గతంలో మాదిరిగా కమిటీలు నియమించి వారి సంక్షేమాలు, సమస్యలు తెలుసుకోవాలన్నారు. వీటితోపాటు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జనరల్ సెక్రటరీ గోపాల్‌రెడ్డి, అన్నమయ్య జనరల్ సెక్రటరీ బాలాజీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యను పరిష్కరించడం హర్షణీయం

కమలాపురం : ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క సంతకంతో పరిష్కరించడం హర్షణీయం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం–3వ వార్డు సచివాలయంలో తహసీల్దార్ అలీఖాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చుక్కల భూములున్న 17 మంది బాధితులకు పట్టాను ఆయన అందేజేసి మాట్లాడారు. చంద్రబాబు 2016లో చుక్కల భూములు రిజిష్టర్ చేయవద్దని 22(ఎ) లిస్ట్‌లో పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. దానికి సీఎం జగనన్న పరిష్కరించారన్నారు. ఒక్క పెండ్లిమర్రిలోనే దాదాపు 3600 మంది రైతులకు జిరాయితీ పట్టాలు ఇచ్చామని, ఇలా రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది ఉన్నారని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై స్పెషల్ ఫోకస్ పెట్టిన సీఎం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


ఇంటర్ విద్యార్థి హేమంత్ కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : జగనన్న సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యా వ్యవస్థపై స్పెషల్ ఫోకస్ పెట్టారని, ఈ నాలుగేళ్లలో కేవలం విద్యా వ్యవస్థపై రూ.62 వేల కోట్లు ఖర్చు చేశారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆణిముత్యాలు సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చదువులే ఆస్తులని నమ్మిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అందుకు తగ్గట్టుగా ఆయన విద్యా వ్యవస్థపై స్పెషల్ ఫోకస్ పెట్టారన్నారు. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్లను నియమించారని, ఇది కూడా చరిత్రాత్మకమే అన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి స్టేట్ టాపర్‌గా నిలవడం చూస్తుంటే ఇక ప్రైవేట్ పాఠశాలలు దిగదుడుపే అన్నారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలో వీఎన్‌పల్లె, కమలాపురం ప్రథమ, ద్వితీయ స్థానంలో హర్షణీయం అని, అందుకు కారణమైన రెండు మండలాల ఎంఈఓగా పని చేస్తున్న జాఫర్ సాదిక్‌ను అభినందించారు. ఈ ఏడాది నుంచి జగనన్న ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలో టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.15వేల నగదుతో ప్రోత్సహించే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రారంభించడం గర్వకారణం అన్నారు. కాగా టెన్త్‌లో షేక్ హాఫిజున్ (578 నందిమండం), సయ్యద్ అన్వర్ హుసేని (576 చెన్నూరు), టి. ధనుంజయ(565 కమలాపురం) లతో పాటు ఇంటర్‌లో ఆవుల హేమంత్ కుమార్ (894 గవర్నమెంట్ కాలేజీ), బి.సాయిలత (912మోడల్ స్కూల్), ఎల్. విష్ణు ప్రియ (895 సోషల్ వెల్ఫేర్) లకు రూ.15వేల నగదుతో పాటు మెడల్, ప్రశంశా పత్రాలతో సత్కరించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కలిపి సన్మానించడం విశేషం. కమలాపురం, చెన్నూరు మండలాల మండల స్పెషలాఫీసర్లు నరసింహారెడ్డి, వెంకట సుబ్బయ్య, ఎంఈఓలు జాఫర్ సాదిక్, వెంకట్రామిరెడ్డి, సుజాత, లిల్లెమ్మ తదితరులు మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అక్రమాలకు పాల్పడే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వకుండా ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ప్రైవేట్ మాల్స్, ఆసుపత్రులు, పాఠశాలలో సెక్యూరిటీ సిబ్బందిగా పని చేస్తున్న కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం నాయకులు ఉదయ్, కేశవ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ వర్కర్లు, ఆయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధమైన ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ నాయకులతో కలిసి వర్కర్లు, ఆయాలు కడప నగరంలోని కడప అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సమస్యల పరిష్కారం కోసం ఈ ఆందోళన చేపట్టామన్నారు. అంగన్వాడీ వర్కర్లు, ఆయాలకు సంబంధించి వేతనాలతోపాటు ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న జీఓలను అమలులో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. బిల్లుల మంజూరులో తీవ్ర వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి


కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కడప కార్పొరేషన్ : మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్. రవి, కె.తిరుపాల్ డిమాండ్ చేశారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, అనారోగ్యంతో బాధ పడుతున్న కార్మికుల కుటుంబాల్లో ఒకిరికి ఉద్యోగం కల్పించాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు సీపీఎస్ రద్దు చేయాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం వర్తింపజేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలన్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే జూలై ఒకటో తేది నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు ప్రకాస్, శ్రీదర్ బాబు, కిరణ్ కుమార్; బ్రహ్మానందరెడ్డి, మస్తాన్, బాలాజీ, అసిబాబు, శివ, ప్రసన్న, మస్తానమ్మ, లక్ష్మిదేవి, పెంచలమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

ఇంటింటికీ నవరత్నాలు


రామచంద్రాపురంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూరుతోందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం గొందిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని రామచంద్రాపురం, ఇందిరానగర్, నల్లయ్యగారిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయ అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు పక్కాగృహాలు, ఇంటి స్థలం లేదని, భూసమస్యలు, విద్యుత్ లైన్ల సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఆయన వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, అగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, ధనుంజయరెడ్డి, రామగంగిరెడ్డి, రమణ, సిద్దారెడ్డి, నరసింహరెడ్డి, నిఖిల్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయ భాస్కర్‌రాజు, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కమలాపురం : బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పెద్దలు పనిలో ఉండాలని కమలాపురం 1వ వార్డు సచివాలయం ఎంఎస్‌కే పద్మజ తెలిపారు. గురువారం జనభాగి కార్యక్రమంలో భాగంగా 1వ సచివాలయం పరిధిలోని కొలిమి వీధి అంగన్‌వాడీ సెంటర్ నుంచి సచివాలయం వరకు వర్కర్లు, తల్లులు, ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బడిలో పిల్లలు–పనిలో పెద్దలు, చిట్టిచేతిలో పలకాబలపం–పెద్దవారి చేతిలో పలుగుపారా, చిన్నారులు బడిలో ఉంటే మోదం–పనిలో ఉంటే ప్రమాదం అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు జ్యోతి, రాణి, గౌసియా, వైష్ణవి, ఎలిజిబెత్ రాణి, లక్ష్మీదేవి, కిరణ్‌కుమారి తల్లులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చలపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆయన తెలిపారు. అలాగే అన్ని శాఖల అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు.